మైనార్టీ కళాశాల సాకారమయ్యేనా?

- ఉన్నత విద్య కోసం దూరప్రాంతాలకు విద్యార్థులు
- వెళ్లలేక ఉర్దూ మీడియంకు దూరమవుతున్న వైనం



రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

శాస్త్రిపురం: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మైనార్టీ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. ఉర్దూ మీడియంలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత చదవుకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వందలాది మంది విద్యార్థులు ప్రతి సంతవ్సరం ఉర్దూ మీడియంలో 10వ తరగతి వరకు చదువుకొని ఉన్నత విద్య కోసం తిప్పలు పడుతున్నారు.

- రాజేంద్రనగర్ సర్కిల్ కేవలం పదవ తరగతి వరకు మాత్రమే ఉర్దూ మీడియంలో చదువుకునే అవకాశం ఉంది. ఇంటర్ విద్య కోసం గత కొన్ని సంతవ్సరాలుగా మైనార్టీటి కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానిక మైనార్టీ ప్రజలు కోరుతున్న పట్టించుకున్న నాథుడు లేడు.
- రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో దాదాపు లక్ష యాభై వేల మందికి పైగా ముస్లింల జనాభా ఉంది. ఇందులో సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్‌లు పూర్తిగా మైనార్టీ ప్రాంతాలు. అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దూమ్‌పల్లి డివిజన్‌లలో కూడా ముస్లింలు ఉన్నారు. ఇక్కడి నుంచి ప్రతి సంవత్సరం వందల మంది విద్యార్థులు 10వ తరగతి వరకు ఉర్దూ మీడియంలో చదువుకొని పాస్ అవుతున్నారు.
- అనంతరం ఇంటర్, డిగ్రీ విద్యను అభ్యసించాలంటే మైనార్టీ కళాశాల లేకపోవడంతో చాల మంది విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లలేక చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. ఎన్నికల సమయంలో తమ ప్రాంతాలకు వచ్చి మైనార్టీ కళాశాలను ఏర్పాటు చేస్తాం అని చెప్పడమే తప్ప ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రాజేంద్రగర్‌లో ఉన్న ప్రభుత్వ ఇంటర్ కళాశాలలోనే ఉర్దూ మీడియంను కూడా ప్రవేశ పెడితే బాగుంటుందంటూ కొంత కాలంగా మైనార్టీలు అడుగుతున్నారు. ఇప్పటి వరకు అధికారులు స్పందించడం లేదు.

తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి...

రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఉన్న మైనార్టీలను దృష్టిలో ఉంచుకొని సర్కిల్ పరిధిలో మైనార్టీ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇంటర్ విద్య కోసం ఉర్దూ మీడియం లేకపోవడంతో నాంపల్లి, మల్లెపల్లి లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నదని విద్యార్థులు వాపోతున్నారు. స్థానికంగా కళాశాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు కూడా సౌకర్యంగా ఉంటుందని దూర ప్రాంతాలకు ఆడపిల్లలను పంపించలేక, ప్రైవేటు కళాశాలలో చదివించలేక మధ్యలోనే చదువును ఆపేయాల్సిన పరిస్థితులు ఉన్నాయని విద్యార్థినిల తల్లితండ్రులు చెబుతున్నారు.

- నూతన కళాశాల ఏర్పాటు చేయక పోయినా రాజేంద్రనగర్‌లో ఉన్న కళాశాల భవనంలోనే ఉర్దూ మీడియంలో బోధన చేయాలని మరికొంత కోరుతున్నారు. ఈ సంత్సరం కాకపోయినా వచ్చే సంవత్సరం నుంచి అయినా రాజేంద్రనగర్‌లో మైనార్టీ కళాశాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కష్టపడి పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



సీతాలక్ష్మిని సన్మానిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: కష్టపడి పనిచేసే ఉద్యోగులకు ఎప్పటికైనా ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వారి సేవలు ప్రజలు గుర్తించుకుంటారని వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సి.హెచ్.విద్యాసాగర్ అన్నారు. విశ్వవిద్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సీతాలక్ష్మి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో ఆమె చేసిన సేవలను కొనియాడారు. తన 28 ఏళ్ల ఉద్యోగ జీవితంలో అంకితభావంతో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త తరలింపు ఇలాగేనా?



కొత్వాల్‌గూడ డంపింగ్‌కు చెత్తను తీసుకువెళ్తున్న టిప్పర్

బండ్లగూడ: అధికారుల సమన్వయ లోపం కారణంగా ప్రజలకు కొత్త తిప్పలు ఎదురవుతున్నాయి. ఖాళీ ప్రదేశాలు, ఓపెన్ పాయింట్లల్లో ఉన్న చెత్తతోనే ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆగ్రహిస్తుంటే ఈ చెత్తను తరలించే సమయంలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు కొత్త తిప్పలు మొదలవుతున్నాయి. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెత్తను సేకరించి టిప్పర్ల సాయంతో నిత్యం కొత్వాల్‌గూడలోని డంపింగ్‌కు తరలిస్తారు. ఈ సమయంలో టిప్పర్ల డ్రైవర్లు చెత్త గాలికి ఎగరకుండా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో చెత్త పూర్తిగా గాలికి ఎగిరి రోడ్లపై పడుతుంది. అలాగే వెనుక నుంచి వస్తున్న వాహనాలపై సైతం పడుతున్నాయి. దీని కారణంగా ప్రధాన రహదారులపై అనేక ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు చెత్తను తరలించే సమయంలో చెత్త ఎగరకుండా చూసుకునేలా టిప్పర్ల డ్రైవర్లకు ఆదేశాలు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేత్రపర్వంగా వేణుగోపాల స్వామి కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవులలోని వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం రాత్రి నయనానందకరంగా నిర్వహించారు. వేద పండితులు వారి మంత్రోచ్ఛరణలతో కల్యాణ గడియల అర్థాలను భక్తులకు వివరిస్తూ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ఎదురుకోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కల్యాణ వేదికపై ఆసీనులను చేసి కల్యాణ మహోత్సవాన్ని మేళతాలాల చప్పుల్లు, వేద మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. అనంతరం హారతి, ప్రసాద గోష్టిని నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో నాలగవ రోజు శనివారం ఉదయం సహస్రనామ పుష్పార్చన, ఉంజల్ సేవ, సాయంత్రం శేషవాహన సేవ, రథోత్సవం నిర్వహించారు. కల్యాణమహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఉత్సవాలలో చివరి రోజు ఆదివారం ఉదయం 10 గంటలకు మహాపూర్ణాహుతి, చక్రస్నానము, సాయంత్రం అశ్వావాహన సేవ, ద్వాదశ ఆరాధన, దేవతా విసర్జన, రుత్విక్ సన్మానాలతో ముగుస్తాయని అర్చకులు గూడా శ్రీనివాసాచార్యులు, వరదరాజాచార్యులు, రాజగోపాలాచార్యులు తెలిపారు.

అడ్డగోలుగా స్పీడ్ బ్రేకర్లు వద్దు: బీఆర్ఎస్

మణికొండ: ఎక్కడ పడితే అక్కడ అడ్డగోలుగా స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అవసరమైన చోట మాత్రమే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా శనివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన సుందర్‌గార్డన్ వెనకాల కాలనీలో పర్యటించి ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ వ్యాప్తంగా ఇష్టారాజ్యంగా స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేయటాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. మున్సిపాలిటీ అధికారులు ఆ విషయాన్ని పరిగణలోకి తీసుకుని అవసరానికి మంచి ఉన్నవి తొలగించాలన్నారు. మున్సిపాలిటీలో పెరుగుతున్న జనాభా, జనావాస కూడలిల వద్ద మూత్రశాలలు నిర్మించక పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరి కొన్ని చోట్ల వాటిని ఏర్పాటు చేయాల్సిన విషయాన్ని అధికారులు పరిశీలించాలన్నారు. పార్టీ నాయకులు జి.నరేందర్, బి. ఉపేంద్రనాథ్ రెడ్డి, జి.విఠల్, శ్రీకాంత్, సుమ నళిని, బాలాజీ, భానుచందర్, ఆరీఫ్ అహ్మద్, కిరణ్, షేక్ ఆరీఫ్, రాజేంద్రప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాను మరింత పెంచుతాం

జలమండలి జీఎం మహేందర్‌నాయక్



జలమండలి జీఎంకు వినతిపత్రం ఇస్తున్న గర్వ నాయకులు

మణికొండ: అలకాపూర్ టౌన్‌షిప్, స్పోర్ట్స్ పార్క్‌లో నిర్మించిన 2.5 కేఎల్ నీటి ట్యాంక్‌ను త్వరలోనే అందుబాటులోకి తెచ్చి నీటి సరఫరాను మరింతగా పెంచుతామని జలమండలి జనరల్ మేనేజర్ మహేందర్‌నాయక్ అన్నారు. శనివారం గ్రేటర్ అలకాపూర్ టౌన్‌షిప్ రెసిడెన్షిస్ వెల్ఫేర్ అసోసియేషన్(గర్వ) అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు కలిసి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టౌన్‌షిప్‌లో అనేక సార్లు నీటి సరఫరా నిలిచిపోవటం, లోప్రెషర్‌తో సరఫరా జరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. అనేక అపార్ట్‌మెంట్‌ల వాసులు నీటి కనెక్షన్‌ల కొరకు డబ్బులు చెల్లించినా ఇప్పటి వరకు వారికి కనెక్షన్‌లు ఇవ్వకపోవటం, ఇచ్చిన వారికి తక్కువ సామర్థంతో ఇవ్వటంతో వారు ట్యాంకర్లపై ఆదారపడి జీవిస్తున్నారన్నారు. స్పోర్ట్స్ పార్క్‌లోని ట్యాంక్‌ను వాడకంలోకి తెచ్చి సరఫరాను పెంచాలని కోరారు. అందుకు స్పందించిన జీఎం మాట్లాడుతూ... కొత్తగా ప్రారంభించిన ట్యాంక్‌ను అందుబాటులోకి తేవాలంటే రెండు రోజుల పాటు నీటి సరఫరాను నిలిపివేయాల్సి వస్తుందని, పైప్‌లైన్ల పనులు చేయాలని, ప్రస్తుతం వేసవి కాలంలో బోర్లు వట్టిపోయి ప్రజలు జలమండలి నీటిపైననే ఆధారపడటంతో ఆ పనులు చేపట్టలేదన్నారు. బోర్లు రీచార్జ్ కాగానే పనులు చేపట్టి ట్యాంక్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. గర్వ ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు దిలిప్ కుమార్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపర్ణ స్కూల్ అనుమతి రద్దు

మణికొండ: సరైన వసతులు లేకుండా కొనసాగుతున్న ఓ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడలో నిర్వహిస్తున్న అపర్ణ స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ గుర్తింపును రద్దు చేసినట్లు మండల విద్యా శాఖాధికారి విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవటంతో చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లా విద్యాధికారి పాఠశాలను మూసివేయాలని, అందులో ఇప్పటికే చదువుతున్న విద్యార్థులకు టీసీలను ఇవ్వాలని ఆదేశించారన్నారు. పాఠశాల రికార్డులను మండల విద్యాధికారికి అందజేయాలని అందులో పేర్కొన్నారని వివరించారు. తల్లితండ్రులు ఆ పాఠశాల నుంచి తమ పిల్లలను తీసివేసి ఇతర గుర్తింపు పొందిన పాఠశాలల్లో చేర్పించాలని ఆయన సూచించారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

పొలం చుట్టూ కంచెకు కరెంటు సరఫరాతో ప్రమాదం



హరిఓం

శంషాబాద్ రూరల్: పొలానికి రక్షణ కోసం ఏర్పాటు చేసిన కంచెకు కరెంటు సరఫరా కావడంతో కూలీ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బోటిగూడలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన హరిఓం, ముకేష్, గోవింద్ నిషాద్ కలిసి బోటిగూడలోని యాదగిరిగౌడ్ పౌల్ట్రీ పాంలో నిర్మిస్తున్న ఇంట్లో మార్బుల్ పని చేస్తున్నారు. 4 నెలల నుంచి ఇక్కడే ఉంటున్నారు. ఈ నెల 29న ఉదయం బహిర్భూమి కోసం ముగ్గురు పౌల్ట్రీఫాం నుంచి కొద్ది దూరం వెళ్లారు. అక్కడ పొలం చుట్టూ ఉన్న కంచెకు కరెంటు సరఫరా ఉండడంతో అటుగా వెళ్లిన హరిఓం తీగను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన ముకేష్ అతన్ని కాపాడే యత్నం చేసినా ఫలితంలేకుండా పోయింది. కరెంటు షాక్‌కు హరిఓం అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం యాజమాని తెలగమల్ల పోచయ్య తన పొలం చుట్టూ కంచెకు కరెంటు షాక్ పెట్టడంతో ఈ ప్రమాదం చోటు చే సుకుంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని దానాల కన్నా రక్త దానం మిన్న



రక్త దానం చేస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: అన్ని దానాల కన్నా రక్త దానం ఎంతో మిన్న అని... ఆరోగ్యవంతులంగరూ తప్పనిసరిగా రక్తన్ని దానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని ఉద్యాన విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్ అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాలలో శనివారం జాతీయ సేవా పథకంలో భాగంగా ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో మోగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులు, బోధన సిబ్బంది 51 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఒక యూనిట్ రక్తన్ని దాదాపు అసరమైన ఆరుగురు వ్యక్తులకు అందజేస్తారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. జాతీయ సేవా పథకం అధికారి లావణ్య, డాక్టర్ వీరన్న గౌడ్, కళాధర్‌బాబు, రామకృష్ణ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

శంషాబాద్ విమానాశ్రయంలో 'అరైవల్' సందడి



శంషాబాద్ ఎయిర్‌పోర్టు అరైవల్ వద్ద టూర్‌లు ముగించుకుని వస్తున్న ప్రయాణికుల సందడి

పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ముగిసే దశలో ఉన్నాయి. వేసవిలో హాలిడేస్‌ను జాలీగా ఎంజాయ్ చేసేందుకు దేశ, విదేశాలకు వెళ్లిన పర్యాటకులు కాస్తా తిరిగి ఇంటి ముఖం పడుతున్నారు. దేశీయ, అంతర్జాతీయ టూర్‌లు ముగించుని వస్తున్న పర్యాటకులతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని అరైవల్ ఏరియా అంతా సందడిగా మారుతోంది. గడచిన రెండు మూడు రోజులుగా ఎయిర్‌పోర్టులో డిపార్చర్ కన్నా.. అరైవల్ వద్దే సందడి అత్యధికంగా ఉంటోంది.

– శంషాబాద్



సమస్యలతో ప్రజలు సతమతం: బీఆర్ఎస్

అత్తాపూర్: ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అప్పారెడ్డి ముఖేష్ అన్నారు. శనివారం అత్తాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు పుప్పాల లక్ష్మణ్, మహేష్‌యాదవ్, నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అత్తాపూర్ శ్మశానవాటికలో సౌకర్యాలు కరువై ఇక్కడకి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మొత్తం చెత్త పేరుకుపోయి నడిచేందుకు సైతం వీలు లేకుండాపోతుందన్నారు. కనీస వసతులు కల్పించేదిశగా అధికారులు చర్యలు తీసుకోనందునే ఈ దుస్థితి నెలకొందన్నారు. పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. ప్రజలకు నడిచేందుకు సైతం వీలు లేకుండా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికారులు వెంటనే ప్రజల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉన్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కాటేదాన్ ఫీడర్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. విశ్వకర్మ ఇంజనీరింగ్, బ్యాటరీ కంపెనీ, బాసప్ప హోటల్ లెన్, హనుమాన్ ఆలయ ప్రాంతం, మినార్ హోటల్, స్వప్న థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

నిద్రమత్తులో డ్రైవర్.. ఔటర్‌పై అదుపు తప్పిన లారీ

మణికొండ: నిద్రమత్తులో ఉన్న డ్రైవర్ లారీని ఔటర్ రింగ్ రోడ్డు అవతలి వైపు ఉన్న సర్వీసు రోడ్డు నుంచి ఇవతలి వైపు సర్వీసు రోడ్డులోకి దాటించాడు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడు పక్కన ఉన్న అశోకా లివియానా వద్ద ఔటర్ అవతలి వైపు క్రిన్స్ విల్లాల రోడ్డు నుంచి ఇటు వైపు వచ్చి పల్టీ కొట్టింది. నిద్రమత్తులో ఉన్న డ్రైవర్ లారీని వేగంగా నడపటంతో అది అదుపు తప్పి ఔటర్ రింగ్ రోడ్డు పై నుంచి ఇటు వైపుకు వచ్చిందని స్థానికులు తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ప్రమాదం జరగటం, ఆ సమయంలో ఔటర్‌రింగ్ రోడ్డుపై ఎలాంటి వాహనాలు రాకపోవటంతో పెను ప్రమాదం తప్పిందని వారు వివరించారు. టోల్ గేట్ ఇంచార్జి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు నార్సింగి పోలీసులు తెలిపారు.

ధోబీఘాట్ నిర్మాణానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న శేఖర్‌యాదవ్

శంషాబాద్ రూరల్: పాల్మాకులలో ధోబీఘాట్ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. శనివారం స్థానికులకు ఆయన ఈ మొత్తాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్, మండల ఉపాధ్యక్షుడు కోటేష్‌గౌడ్, నాయకులు బి.కుమార్, అశోక్, ఫక్రు, ప్రభాకర్ యాదవ్, ప్రవీణ్, నర్సింహా, స్థానికులు యాదయ్య, అరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి



అత్తాపూర్‌లో ప్యాచ్‌వర్క్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

అత్తాపూర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ పార్టీ అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు గొంది ప్రవీణ్‌రెడ్డి అన్నారు. అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 122 నుంచి లోపలికి వెళ్లే దారిలో ప్యాచ్‌వర్క్ పనులను చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొన్ని రోజులుగా గోతులు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు సానుకూలంగా స్పందించి తాత్కలిక మరమ్మతుల నిమిత్తం బీటీ మిశ్రమంతో గోతులను పూడ్చివేశారన్నారు. రానున్న రోజుల్లో సమస్య ఉత్పన్నమైతే నూతన రోడ్డును వేసి శాశ్వత పరిష్కారం చూపిస్తామని అధికారులు వెల్లడించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.మహేష్, అత్తాపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సులిగే మహేందర్, ఎస్.రవీందర్‌కుమార్, పి.కృష్ణమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జంతు వ్యర్థాల తరలింపునకు పటిష్ట ఏర్పాట్లు



జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాలనీలు, బస్తీల అధ్యక్షులతో పాటు సిబ్బందితో శనివారం జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ సమావేశమయ్యారు. బక్రీద్ నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో 30 ప్లాస్టిక్ బ్యాగ్‌లను పంపిణీ చేస్తామన్నారు. ఆయా బ్యాగుల్లోనే జంతువుల వ్యర్థాలను వేయాలని.. అలాగే ప్రతి ఒక్కరికీ ఈ విషయాన్ని సమాచారం అందించాలన్నారు. ఎమ్మెల్సీ రహమత్ బేగ్ మాట్లాడుతూ... వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక సిబ్బందితో పాటు వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. ఇబ్బంది కలుగకుండా పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ... బక్రీద్ సందర్భంగా పెద్ద ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ప్రధాన రహదారులపై పికెట్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఎవరూ పుకార్లను నమ్మవద్దని సూచించారు. ఎలాంటి సమాచారం ఉన్న తమకు సమాచారం అందించాలన్నారు. తాము బందోబస్తును పర్యవేక్షిస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

యువకుడు మృతి

గచ్చిబౌలి: బైక్‌ను వెనక నుంచి టిప్పర్ ఢీ కొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకునికి తీవ్ర గాయాలైన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేష్ గౌడ్ తెలిపిన ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం మండలం కందుల పాలెంకు చెందిన దుర్గా కిరణ్(25) గచ్చిబౌలి పీజేఆర్‌నగర్‌లో నివాసం ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నారు. స్నేహితుడు వెంకటదుర్గా ప్రసాద్‌తో కలిసి శనివారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో బైక్‌పై బీరంగూడకు బయలుదేరారు. ట్రిపుల్ ఐటీ సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొట్టడంతో ఇద్దరు ఎగిరి కిందపడ్డారు. బైక్ నడుపుతున్న దుర్గా కిరణ్‌కు తీవ్రగాయాలవడంతో సమీపంలోని కేర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. బైక్ వెనక ఉన్న వెంకటదుర్గా ప్రసాద్ కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

